క్లుప్తంగా

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

చాట్రాయి: సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి బి.శివశంకర్ చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నామన్నారు. జీలుగ 480 క్వింటాళ్లు, పిల్లిపెసర 33.80 క్వింటాళ్లు, జనుము 35 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

విస్సన్నపేట: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని ఏవో రాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. సబ్సిడీ పోను జీలుగు కిలో రూ.44, పిల్లిపెసర రూ.67, జనుము రూ.44లు నిర్ణయించామని చెప్పారు. విస్సన్నపేట ఆర్బీకేలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను ఏవో అందజేశారు.

రామాలయ భూముల కౌలు వేలం

చాట్రాయి: మండలంలోని చనుబండ శ్రీకోదండ రామాలయానికి చెందిన భూములకు మంగళవారం కౌలు వేలం నిర్వహించామని దేవాదయ శాఖ డివిజినల్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ సుమారు 31 ఎకరాల భూమిని మూడేళ్ల పాటు కౌలుకు ఇచ్చామన్నారు. ఇందుకు గాను ఒక్కొక్క సంవత్సరానికి రూ.4.70 లక్షలు వేలంలో దక్కించుకున్నారని చెప్పారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో 300 లీటర్ల మజ్జిగ పంపిణీ

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మంగళవారం దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మైలవరం పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌హెచ్ కాంప్లెక్స్ వద్ద గత 8 ఏళ్లుగా వేసవిలో చలివేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. తాగునీటితో పాటు దాతల సహకారంతో బాటసారులకు మజ్జిగ కూడా అందజేస్తున్నామని చెప్పారు. ఐసీడ్స్ ఆప్టికల్స్ అధినేత పుల్లారెడ్డి సహకారంతో మజ్జిగ పంపిణీ చేశామన్నారు. చంద్రశేఖర్, శివ, మల్లిఖార్జునరావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం



నూజివీడు గ్రంథాలయంలో శిక్షణ ఇస్తున్న సిబ్బంది

ఆగిరిపల్లి: గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం లభిస్తుందని స్థానిక గ్రంథాలయాధికారి డి.నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి గ్రంథాలయాల్లో సమ్మర్ కోచింగ్ క్లాసులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళవారం విద్యార్థులకు పుస్తకాలు చదవడం, కథలు చెప్పటం, ఆటలు ఆడించడం కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు రజిని, ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడు: పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో పలు విజ్ఞాన పుస్తకాలతో పాటు కథల పుస్తకాలు చదివించారు. అనంతరం పలువురు విద్యార్థులతో నీతి కథలు చెప్పించారు. అలాగే క్యారమ్స్, చెస్ వంటి ఆటలు నేర్పించారు. ప్రతి రోజూ ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రంథాలయానికి విద్యార్థులు వచ్చి పుస్తకాలు చదువుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు యోగా నేర్పారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి ప్రతి రోజూ యోగాసనాలు చేయాలని గ్రంథాలయాధికారి పద్మావతి సూచించారు. పాటలు పాడటం, మ్యూజికల్ చైర్స్, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సుధీర్, శాంతారావు, భరతకుమారి పర్యవేక్షించారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని ప్రార్థనలు



కొండపల్లి దర్గాలో ప్రార్థన చేస్తున్న సచివాలయ కన్వీనర్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రతి పేదవాడు తలెత్తుకుని బతకాలని, నవరత్న పథకాలతో సంక్షేమం అందజేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కొండపల్లి సచివాలయ కన్వీనర్లు స్థానిక షాబూఖారీ దర్గాలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరి ఆశీస్సులతో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేయాలని ఆకాంక్షించారు. అలాగే మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టాలని ప్రార్థించారు. సచివాలయ కన్వీనర్లు షేక్ జానీ షరీఫ్, కాలగడ్డ మనోహర్, మొగిలి నాగరాజు, మాడుగుల చందు, పిట్టల మల్లికార్జునరావు, డొక్కమాల పవన్‌కుమార్, కుంచెం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి

నూజివీడు: దేశాన్ని సాంకేతిక రంగం వైపు పయనించేలా అనేక నిర్ణయాలు తీసుకుని అమలు చేసిన గొప్ప దార్శనికుడు దివంగత రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి మరీదు కృష్ణ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు.

మైలవరం: మైలవరంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి కార్యక్రమాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు నిర్వహించారు. స్థానిక బోసు బొమ్మ సెంటర్‌లో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసిన నాయకులు నివాళులర్పించారు.

తిరువూరు: దివంగత భారత ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. దేశప్రగతికి, సాంకేతికాభివృద్ధికి రాజీవ్ చేసిన కృషిని పార్టీ మండల అధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాసరావు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మైలవరంలో పోలీసుల కార్డన్ సెర్చ్

మైలవరం: మైలవరం తారకరామానగర్ ఏరియాలో మైలవరం పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ ఎస్.మురళీమోహన్ పర్యవేక్షణలో మంగళవారం ఆపరేషన్ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మురళీమోహన్ మాట్లాడుతూ.. కమిషనర్ ఆఫ్ పోలీస్ రామకృష్ణ ఆదేశాల మేరకు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.శ్రీనివాసరావు సూచనలతో తనిఖీలు చేపట్టామన్నారు. ఇటీవల ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ముందస్తు జాగ్రతలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు కలిగి ఉంటే, వాటిని సీజ్ చేస్తామన్నారు. అనుమానిత వస్తువులు, అనుమానితులు, బయటి వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే తమకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. కార్డన్ సెర్చ్‌లో సీఐ కిషోర్‌బాబు, సబ్ డివిజన్ పరిధిలోని జి.కొండూరు, రెడ్డిగూడెం, తిరువూరు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు

ఆగిరిపల్లి: స్థానిక శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో జయంత్యుత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ మంగళవారం చెప్పారు. బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, శాంతి కల్యాణం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మైలవరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ పుష్పలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విజయవాడ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యక్రమాల్లో భాగంగా సోషల్ ఇష్యూస్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మైలవరం, ఇబ్రహీంపట్నం మండల కార్యాలయాల వెలుపలి గోడలపై భారీ పెయింటింగ్‌లు వేయించామని చెప్పారు. ప్రజల్లో బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టడానికి, బాల్య వివాహాలు నిరోధించాలని చైతన్యం కల్పిస్తున్నామన్నారు. నేటి ఆడపిల్ల రేపటి అమ్మ అనే విషయం, చిన్నారుల దత్తత, బాల్య వివాహాలతో వచ్చే ఇబ్బందులను వివరిస్తున్నామని సీడీపీఓ పుష్పలత చెప్పారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆగిరిపల్లి: గ్రామ పారిశుద్ధ్య, బహిరంగ మల విసర్జన రహిత గ్రామాల పరిశీలనలో భాగంగా మండలంలోని ఈదర, నరసింగపాలెంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను నూజివీడు ఎంపీడీవో కిరణ్, ఆయన బృందం మంగళవారం పరిశీలించారు. అనంతరం వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శామ్యూల్, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, సంగమయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బాటిళ్లలో పెట్రోల్ విక్రయాలు చేయరాదు

ఏ.కొండూరు: పెట్రోల్ బంకుల్లో బాటిళ్లలో పెట్రోల్ విక్రయాలు చేయరాదని ఎస్ఐ చల్లా కృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కంభంపాడు, ఏ.కొండూరు, చీమలపాడు పెట్రోల్ బంక్‌ల వద్దకు వెళ్లి పరిశీలించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లూజ్ పెట్రోల్ విక్రయించరాదన్నారు. లూజ్ పెట్రోల్ విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే పెట్రోల్ బంకులు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏ.కొండూరు: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు కోరారు. మండలంలోని కంభంపాడు గ్రామంలో మంగళవారం ఉపాధిహామీ కూలీలు పనులు చేస్తున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీ రేట్లు పెంచాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి సంబంధించిన బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని వెంటనే పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు కొల్లి నాగేశ్వరరావు

తిరువూరు: రైతాంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించిన కొల్లి నాగేశ్వరరావు చిరస్మరణీయుడని సీపీఐ జిల్లా సమితి మాజీ కార్యదర్శి తూము కృష్ణయ్య అన్నారు. స్థానిక సుంకర వీరభద్రరావు భవన్‌లో కొల్లి వర్ధంతిని మంగళవారం జరిపారు. కొల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాలపాటి ఉదయ్, నాగులమీరా, చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముసునూరు: భూ పోరాటాల వీరుడిగా జాతీయ ఖ్యాతినార్జించిన కొల్లి పోరాట పంథా నేటి యువతకు ఆదర్శమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు అన్నారు. సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి, భూపోరాటాలకు మార్గదర్శి దివంగత కొల్లి నాగేశ్వరరావు నాలుగో వర్ధంతిని ఆయన స్వగ్రామం గుడిపాడులో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముందుగా గ్రంథాలయం వద్ద పార్టీ పతాకాన్ని ఎగురవేసి, కొల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. రైతు నేతలు వలసపల్లి రామచంద్రప్రసాద్, కొల్లి గంగారామ్, మసిముక్కు సుబ్బారావు, కూచిపూడి నాగేశ్వరరావు, కొల్లి సమకాలికులు, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సాధారణ సమావేశం

విస్సన్నపేట: స్థానిక మండల పరిషత్ ఆవరణలో వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.విజయకుమారి మంగళవారం తెలిపారు. ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అధ్యక్షతన జరిగే సాధారణ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలన్నారు.

